సాక్షి
నల్లగొండ

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



రూ.కోట్ల విలువైన సొత్తు చోరీ

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో గట్టి పోలీస్ బందోబస్తు ఉన్నా రూ.కోట్ల విలువైన సామగ్రి చోరీకి గురవుతోంది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 43,419 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 43,419 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,394 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,415 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,210 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 643 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 2,724 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: నిల్
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

17న ప్రజా పాలన దినోత్సవం

- నల్లగొండలో జాతీయ జెండా ఎగురవేయనున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : ప్రభుత్వం ఈ నెల 17న ప్రజా పాలన దినోత్సవం నిర్వహించనుంది. అందులో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేసేందుకుగాను ప్రజాప్రతినిధులను ప్రకటించింది. నల్లగొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జెండా ఎగురవేస్తారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భువనగిరి జిల్లా కేంద్రంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

బాలికల న్యూ ఐటీఐలో 4వ విడత అడ్మిషన్లు

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల న్యూ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి 4వ విడత అడ్మిషన్లకు 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, స్టెనో, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో దరఖాస్తుదారుని ఫోన్ నంబర్, టెన్త్ మెమోలో ఉన్న విధంగా వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 89192 34137 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జ్వరాలపై ప్రజలు భయాందోళన చెందొద్దు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

త్రిపురారం: జిల్లాలో డెంగీ జ్వరాలు లేవని, ప్రస్తుతం వస్తున్నవి సాధారణ జ్వరాలేనని వాటిపై ప్రజలు ఆందోళన చెందవద్దని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో నాలుగు డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. సాధారణ జ్వరాన్ని ఆర్‌ఎంపీలు అనవసరపు టెస్టులు చేయించి డెంగీ జ్వరాలుగా సృష్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఇకనుంచి అలాంటి చర్యలకు పాలపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌లు, ఆసుపత్రులు నిర్వహిస్తే చట్టం ప్రకారం క్రిమినల్ కేసుల నమోదు తప్పదన్నారు. జ్వరాల బారిన పడిన ప్రజలు వైద్యుల సూచనల మేరకు టెస్టులు చేయించుకొని మెడిసిన్ వినియోగించాలన్నారు. అనవసరంగా ప్రైవేటుఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వైద్యసిబ్బంది వెళ్లి జ్వర సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతావాణి, త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, పుట్ట గోపాల్‌రెడ్డి, ల్యాబ్ అసిస్టెంట్ వెంకన్న వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూసీ గేట్లు మూసివేత

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అధికారులు బుధవారం మధ్యాహ్నం క్రస్ట్‌గేట్లను పూర్తిగా మూసివేసి నీటి విడుదలను నిలిపివేశారు. కాగా మూసీ ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు 2,724 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రం వరకు 643 అడుగుల వద్ద ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.96 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పర్వాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక పర్వాలు ఆగమశాస్త్రం ప్రకారం కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టి అర్చన, అభిషేకం చేశారు. ఆలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నిర్వాసితులకు న్యాయం

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన వారిని గౌరవిస్తాం

- అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తాం
- 2025 మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి థర్మల్ పవర్ ప్లాంట్ సందర్శన
- రెండు యూనిట్లలో సింక్రనైజేషన్ ప్రారంభం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. మహోన్నత ఆశయం కోసం రైతులు భూములు త్యాగం చేశారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిర్వాసితులకు నెల రోజుల్లోపు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని, ప్రాజెక్టు ప్రారంభమయ్యేలోపు అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి బుధవారం సమీక్షించారు. యూనిట్ -2 సింక్రనైజేషన్‌ను ప్రారంభించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 2025 మార్చి చివరి నాటికి 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు రవాణాకు పవర్ ప్లాంట్ నుంచి నాలుగు లైన్ల ప్రత్యేక రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. రైల్వే లైన్‌ను త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పాంట్‌తో పాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్లాంట్‌లో సబ్ కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎంను కోరారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పవర్‌స్టేషన్ నాలుగు సంవత్సరాలు ఆలస్యమైనప్పటికీ త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. డిసెంబర్ నాటికి 3 యూనిట్లు, మార్చి 31 నాటికి అన్ని యూనిట్లు ప్రారంభించి విద్యుత్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జెన్‌కో సీఎండి రొనాల్డ్ రోస్ పవర్ ప్లాంట్ అన్ని యూనిట్ల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పవర్ ప్లాంట్ స్టేజ్-1, 2లో నిర్దేశించిన సమయం ప్రకారం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, సీఈ సమ్మయ్య, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రులకు విన్నవిస్తున్న యువకులు

సింక్రనైజేషన్ విజయవంతం

యాదాద్రి థర్మల్ విద్యుత్ పవర్‌ప్లాంట్‌లో స్టేజ్ -1లో 1, 2 యూనిట్ల సింక్రనైజేషన్ విజయవంతమైంది. జెన్‌కో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లను నిర్మిస్తుండగా ఒక్కొక్క యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. గత రెండు నెలల క్రితం ఈ యూనిట్‌లో మొదటి దశలో ఆయిల్ లైటప్ నిర్వహించి బాయిలర్ పనితీరును పరిశీలించగా బుధవారం రెండో దశలో రెండు యూనిట్లలో ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. అధిక ఉష్ణోగ్రతతో ఆవిరి ద్వారా ప్లాంట్‌లో బిగించిన టర్బైన్లను తిప్పి వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి కొద్ది రోజులు పరిశీలించి కమర్షియల్ ఆపరేషన్‌కు అప్పగిస్తారు. అనంతరం బొగ్గుతో మండించి విద్యుత్ ఉత్పాదన చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు.

ఉపాధి కల్పించాలని నిర్వాసితుల మొర

యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఉపాధి కల్పించి ఆదుకోవాలని దామరచర్ల మండలంలోని కపూర్‌తండా, మొదులకుంటతండా గ్రామస్తులు బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మొరపెట్టుకున్నారు. ప్లాంట్ నిర్మాణానికి వెయ్యి ఎకరాలకు పైగా భూమి ఇచ్చామన్నారు. ఉపాధి కల్పించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఉపాధి లేక 173 కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాయని డిప్యూటీ సీఎంకు వివరించారు. స్పందించిన ఆయన.. తక్షణమే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ప్లాంట్‌లో నెల రోజుల్లోపు ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పవర్ ప్లాంట్‌లో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన దాదాపు 2 గంటల పాటు సాగింది. మధ్యాహ్నం 3.40 గంటలకు ప్లాంట్‌కు చేరుకున్న వారు.. సాయంత్రం 5.30 గంటలకు తిరిగివెళ్లారు.

విషజ్వరాలపై ప్రభుత్వానికి పట్టింపులేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన వర్షిత్‌రెడ్డి, నాయకులు

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కూడా లేవని అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సమావేశంలో, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. రోగులు ఉన్న చోట కనీసం వైద్యులు కూడా లేరని, ఆయుష్మాన్ భారత్ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. మిషన్ భగీరథ నీరు కలుషితం అవుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. రుణమాఫీపై రైతులను మోసం చేశారన్నారు. సీఎం అందుబాటులో ఉండకుండా నిత్యం అబద్ధాలు వల్లె వేస్తున్నారన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక కేసీఆర్‌కు ఎంత అహంకారం పెరిగిందో రేవంత్‌రెడ్డికి ఈ తొమ్మిది నెలల్లోనే అంత పెరిగిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటున్నారని ఆరోపించారు.

పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాను ముందంజలో ఉంచాలి

బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే జిల్లాను ముందంజలో ఉంచాలని ఈటల రాజేందర్ అన్నారు. ప్రజలకు మాట ఇస్తే కట్టుబడి ఉండే పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచుతామని పెంచలేదని, ఆడపిల్లలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాసగౌడ్, నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి కోరారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, బీఎస్పీ చీఫ్ బెహన్ జీ మాయావతి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా దానికి మద్దతుగా నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోలి సైదులు, చింతపల్లి బాలకృష్ణ, తాళ్లపల్లి సురేష్, గండమల్ల జానయ్య, నాగటి జోసెఫ్, ఏకుల సురేష్, నాగిళ్ల మారయ్య, చిలగమళ్ల యాదగిరి, విష్ణుష్, గండమళ్ల శ్రీనివాస్, నాగిళ్ల మారయ్య, మెరుగుమళ్ల భిక్షం, పెరమాళ్ల ప్రమోద్, బొల్లు సైదులు, మేడ సైదులు, కొల్లి మురళి, ఆకాష్ ఉన్నారు.

అన్ని రంగాల్లో సీఎం విఫలం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని రంగాల్లో విఫలమయ్యారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే తప్పించుకునే లెక్కలు చెబుతున్నారన్నారు. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రా పేరుతో సామాన్యులను ఇబ్బందులు పెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారని, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి మాజీ జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు జాల వెంకట్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, కానుగు యాదగిరి, పాశం ప్రభాకర్‌రెడ్డి, మీసాల రాగ్ని, వంటల చేతన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారితో 13న ఫోన్ ఇన్



వరుస వర్షాలు, వరదల కారణంగా వివిధ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వరి, పత్తి, ఇతర ఆరుతడి పంటలను కాపాడుకునే దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు నేరుగా జిల్లా వ్యవసాయాధికారికి ఫోన్ చేసి పంటల సస్యరక్షణ, వరదల నష్ట నివారణ, తెగుళ్ల బెడద సమస్యలపై సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవచ్చు.

శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

తేది. 13.09.2024 శుక్రవారం
సమయం : ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : **72888 94477**

అక్రమ కనెక్షన్లు ఏడువేలు!

నీలగిరిలో ఇష్టానుసారంగా నల్లా కనెక్షన్లు

- ముడుపులకు ఆశపడి ఇచ్చిన ఫిట్టర్లు
- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- క్రమబద్ధీకరణపై పాలకవర్గం దృష్టి

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీలో అక్రమ నల్లా కనెక్షన్లు వేల సంఖ్యలో ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతున్నా ఉన్నతాధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపాలిటీ పరిధిలో 41,800 ఇంటి నంబర్లు ఉన్నాయి. వాణిజ్య భవనాలు మినహా నివాస గృహాలు 35,800 ఉన్నాయి. వీటిలో 28,500 భవనాలకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే దాదాపు 7 వేలపైగా నివాసగృహాల్లో అక్రమంగా నల్లా కనెక్షన్లు కలిగి ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ..

క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఫిట్టర్లు కేవలం ఐదారు వందల రూపాయలకు ఆశ పడి మున్సిపల్ ఆదాయానికి భారీగానే గండి కొడుతున్నారు. ప్రజలకు కూడా తక్కువ డబ్బులతోనే కనెక్షన్ తీసుకోవచ్చన్న అవగాహన లేకపోవడం కూడా ఈ అక్రమ నల్లా కనెక్షన్‌లకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి అధికారికంగా కనెక్షన్ ఇస్తే ఏళ్ల తరబడి మున్సిపాలిటీ నీరు అందుతుంది. కానీ కొందరు నిబంధనల ప్రకారం నల్లా కనెక్షన్ తీసుకోకుండా మున్సిపల్ సిబ్బందికి కొన్ని ముడుపులు ముట్టజెప్పి కనెక్షన్ ఏర్పాటు చేయించుకుంటున్నారు. ఈ కారణంగా సుమారు నెలకు రూ.8లక్షల చొప్పున ఏడాదికి రూ.96 లక్షల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోతున్నట్లు తెలుస్తోంది. చూస్తే నెలకు రూ.100 మాత్రమే అనుకుంటున్నా మొత్తంగా లెక్క వేసి చూస్తే మున్సిపాలిటీకి భారీ నష్టం వస్తుంది. అదేవిధంగా పాత బస్తీలోని కొందరు అక్రమ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని మున్సిపల్ సిబ్బందిని ఇళ్లలోకి రానివ్వట్లేదని తెలిసింది. పానగల్ ప్రాంతంలో కూడా కొందరు మున్సిపల్ సిబ్బందిని బెదిరించి నల్లా కనెక్షన్‌లు ఇప్పించుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ నల్లా కనెక్షన్‌లకు చెక్ పెట్టాలని పాలకవర్గం చర్యలు ప్రారంభించింది. పాలకవర్గం హెచ్చరించడంతో సిబ్బంది అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

నీలగిరి పట్టణంలోని భవనాలకు నల్లా కనెక్షన్ ఇవ్వాలంటే ఇంటి, ఆస్తి పన్ను రశీదు సమర్పించాలి ఉంటుంది. దాంతో పాటు తెల్ల రేషన్ కార్డు అయితే రూపాయి ఫీజు, అడ్వాన్స్ కింద రూ.300 తీసుకుంటారు. వీరు రోడ్ కటింగ్ (గాతు) తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా వెయ్యి రూపాయలు కన్నా ఎక్కువ ఆస్తి పన్ను ఉన్న వారికి రూ.100తో పాటు రోడ్ కటింగ్ కోసం రూ.1,200, అడ్వాన్స్ కింద రూ.300 చొప్పున మొత్తం రూ.1,600 చెల్లిస్తే నల్లా కనెక్షన్ ఇస్తారు. నల్లా కనెక్షన్ తీసుకున్న వారు నెలకు రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా కొందరు మున్సిపల్ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ మున్సిపాలిటీకి నష్టం చేకూరుస్తున్నారు. మున్సిపాలిటీ నిబంధనలను పట్టించుకోకుండా స్థానిక సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పైఅధికారులకు, పాలకవర్గానికి తెలియకుండా అక్రమంగా నల్లా కనెక్షన్‌లు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం పొందాలి

మున్సిపాలిటీలో దరఖాస్తు చేయకుండా అక్రమంగా నల్లా కనెక్షన్‌లు ఇస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తాం. మున్సిపల్ నిబంధనల ప్రకారం నల్లా కనెక్షన్లు పొందాలి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

పామాయిల్ సాగుపై దృష్టిపెట్టాలి



రైతులతో మాట్లాడుతున్న సాయిబాబా

చండూరు: ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు అందిస్తున్న నేపథ్యంలో రైతులు పామాయిల్ తోటల సాగుపై దృష్టిసారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వీవీసీ.సాయిబాబా అన్నారు. బుధవారం చండూరు మండలం బంగారిగడ్డలో రైతులకు పామాయిల్ తోటల సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. డ్రిప్‌లకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు, ఐదెకరాల లోపు ఓసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పామాయిల్ మొక్కలు సాగు చేసినందుకు ఎకరాకు రూ.4,200ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ యాదగిరి మాట్లాడుతూ మార్కెట్‌కు ఇబ్బంది లేని పంట ఆయిల్ పామ్ మాత్రమే అన్నారు. ఈ సదస్సులో మునుగోడు నియోజకవర్గ హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ శ్రీనివాస్, ఏవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం

- ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- వారం రోజుల నుంచి క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న బృందాలు
- మొత్తం 1.35 లక్షల అర్జీలు
- ఇప్పటి వరకు పరిశీలించినవి 500
- మూడు నెలల్లో ప్రక్రియను పూర్తిచేస్తామంటున్న అధికారులు

నల్లగొండ: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రక్రియను ముమ్మరం చేసింది. అనుమతి లేని ప్లాట్లలో, అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు, 844 గ్రామ పంచాయతీల్లో లక్షా 35 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులరైజేషన్‌కు పూనుకున్నా కోర్టు కేసులతో ఆగిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 500 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది.



క్షేత్ర స్థాయికి వెళ్లి..

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కింద వచ్చిన దరఖాస్తులను మండల స్థాయి బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. మున్సిపాలిటీల్లో కూడా ఆర్‌ఐ, నీటిపారుదల ఏఈతోపాటు మున్సిపల్ టీపీఎస్‌ల ఆధ్వర్యంలో ముగ్గురు అధికారులు ఒక్కో దరఖాస్తును పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో దరఖాస్తుల భూమి వద్దకు వెళ్లి జీపీఎస్ ద్వారా పరిశీలన చేస్తున్నారు.

ప్రభుత్వ భూములైతే తిరస్కరణ..

అనుమతి లేని ప్లాట్లు , వెంచర్లలోని ప్లాట్లను కొనుగోలు చేసిన వారి ప్లాట్ నిజంగా అది పట్టా భూమా కాదా..? అనేది పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ భూమి అయినా, శిఖం భూమి అయినా, బూదాన్ భూమి అయినా, ఫారెస్ట్ భూమి, వక్ఫ్ భూమి తదితర ఏ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూమి అయినా కూడా ఆ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఒకవేళ అది పట్టా భూమైతే ఆన్‌లైన్‌లో ఓకే చేస్తున్నారు.

ప్రభుత్వానికి భారీగా రానున్న ఆదాయం

జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో సంబంధిత అధికారులు ఇప్పటికే 500 దరఖాస్తుల పరిశీలించారు. ఈ ప్రక్రియ మూడు మాసాల్లో పూర్తికానున్నట్టు అధికారులు పేర్కొన్నారు. అయితే ప్లాట్ రెగ్యులరైజేషన్‌తోపాటు ఓకే అయిన దరఖాస్తులకు సంబంధించి భవన నిర్మాణాలు కోసం అనుమతి తీసుకోనే వారి నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం రానుంది.

మూడు మాసాల్లో పూర్తవుతుంది

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగంగా సాగుతోంది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానంలో మూడు విడతల్లో ఒక్కో దరఖాస్తును పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని డాక్యుమెంట్లు ఉంటేనే రెగ్యులరైజేషన్ అవకాశం ఉంటుంది.

– లక్ష్మీనారాయణ, డీటీసీపీఓ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మమత

కనగల్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మమత బుధవారం తెలిపారు. ఈ నెల 8న దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో 9వ తరగతి చదువుతున్న కే. శివ, కే. గౌతమ్ అత్యుత్తమ ప్రదర్శన కనర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని మౌలాలీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలి పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీఏ, ఉపాధ్యాయులు అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో టెంట్‌హౌస్ దగ్ధం

మునగాల: షార్ట్ సర్క్యూట్‌తో టెంట్‌హౌస్ దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మునగాల మండలం గణపవరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన ఎస్‌కే ఇమామ్ సాహెబ్ కొంతకాలంగా టెంట్‌హౌస్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి బయట ఉన్న విద్యుత్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో టెంట్‌హౌస్‌లో ఉన్న వస్తువులతో పాటు ద్విచక్ర వాహనం దగ్ధమయ్యాయి. బాధితుడికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు



మేళ్లచెరువు-చింతలపాలెం రోడ్డులో అదుపు తప్పి రహదారి పక్కకు వెళ్లిన స్కూల్ బస్సు

మేళ్లచెరువు: మండల కేంద్రం నుంచి చింతలపాలెం వెళ్లే దారిలో రైల్వే అండర్‌పాస్ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండడంతో వాహనాలు వెళ్లడానికి తాత్కాలిక రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వానలకు ఆ రోడ్డు గుంతలమయం, బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రానికి విద్యార్థులతో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విద్యార్థులందరూ సురక్షితంగా ఉండడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



గుర్తుతెలియని మహిళ మృతదేహం

నల్లగొండ క్రైం: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల రేకుల షెడ్డు కింద గుర్తుతెలియని మహిళ బుధవారం మృతి చెందింది. సుమారు 60ఏళ్ల వయస్సు ఉన్న ఆమె అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిసింది. మృతురాలి వివరాలు తెలిసిన వారు నల్లగొండ టూటౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ నాగరాజు సూచించారు.

రూ.కోట్ల విలువైన సొత్తు చోరీ

- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో 2017 నుంచి చోరీ అవుతున్న విలువైన సామగ్రి
- నేరుగా వాహనాలతో ప్లాంట్‌లోకి వచ్చిపోతున్న దొంగలు
- సామగ్రి అపహరణపై ఎన్నో అనుమానాలు
- ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రూ.40వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విలువైన కాపర్ సామగ్రి చోరీ అవుతోంది. 2017 నుంచి ఇప్పటివరకు కోట్ల విలువైన సామగ్రిని దొంగలు కొల్లగొట్టినట్లు సమాచారం. అనధికారికంగా రూ.100కోట్లకు పైనే విలువైన అల్యూమినియం, కాపర్ సామగ్రి చోరీకి గురైనా.. అధికారులు మాత్రం కేవలం రూ.10కోట్ల వరకే ఉంటుందని చెబుతున్నారు. అసలు ఈ దొంగతనాలకు కారకులెవరో పసిగట్టడంలో పోలీసు, పవర్‌ప్లాంట్ ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు. ప్లాంట్‌లో గట్టి బందోబస్తు ఉన్నప్పటికీ సీసీ కెమెరాలు పకడ్బందీగా ఏర్పాటు చేసినప్పటికీ దొంగలు, లారీలు వచ్చిపోతుండడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్లాంట్ నిర్మాణంలో అవసరమైన బ్రాస్, జీఐ బండిల్స్, అల్యూమినియం, కాపర్ వంటి సామగ్రి చోరీకి గురవుతోంది. పది, పదిహేను రోజులకొకసారి ఈ దొంగల ముఠా ప్లాంట్‌లోని విలువైన సామగ్రిని దొంగలించి నిర్మానుష్యమైన ప్రాంతాల్లో నిల్వ ఉంచి ఆపై లారీల్లో తరలిస్తూ మిర్యాలగూడలోని పాత ఇనుప దుకాణాదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ..

2016లో ప్రారంభించిన ప్లాంట్ చుట్టుపక్కల భారీ ప్రహరీని ఏర్పాటు చేశారు. ఎత్తయిన గోడలు నిర్మించి లోపలికి ఎవరూ ప్రవేశించకుండా చేశారు. అంతేకాకుండా ప్లాంట్‌కు చుట్టూ 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ప్రత్యేకంగా ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, సివిల్ పోలీసులు పహారా కాస్తున్నారు. ప్రధానంగా ప్లాంట్‌లోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంది. అయినప్పటికీ దొంగలు ప్లాంట్‌లోకి వస్తూ సామగ్రిని చోరీ చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసు విచారణలో తేలింది. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో దొంగతనాల విషయంపై బీహెచ్‌ఈఎల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆరు నెలల క్రితం 11మందిని అదుపులోకి తీసుకొని విచారించి కోర్టుకు రిమాండ్ చేశారు.

ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో చోరీలకు పాల్పడుతున్న కేసులో బుధవారం మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన మేకల శ్రీను, దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడేనికి చెందిన పెండెం భాస్కర్, చెన్నబోయిన నాగయ్య, వీర్లపాలెం గ్రామానికి చెందిన గుగులోతు రఘు, కొర్ర శ్రీను, గుగులోతు రాముడు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన బత్తుల జానకి రాములు, పగడాల బాలరాజు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లోకి అక్రమంగా చొరబడి కాపర్ సామగ్రిని మహీంద్రా క్యాంపర్ వాహనంలో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో పోగు చేస్తున్నారు. ఆ సామగ్రి తమ వాహనంలో తీసుకుని మిర్యాలగూడ పట్టణంలోని పాత ఇనుప సామాను దుకాణాల నిర్వాహకులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ వద్ద పగడాల బాలరాజుకు చెందిన పాత ఇనుప సామాను షాపు వద్దకు బుధవారం టూటౌన్ సీఐ పి. నాగరాజు, రూరల్ సీఐ వీరబాబు తమ సిబ్బందితో కలిసి వెళ్లి నిందుతులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కాపర్ అమ్మగా వచ్చిన రూ.26 లక్షలతో పాటు రెండు మహీంద్రా క్యాంపర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మేకల శ్రీనుపై గతంలో పలు కేసులుండడంతో అతడిపై రౌడీషీట్ తెరవనున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ నాగార్జున, వీరబాబును ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణయ్య తదితరులున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

అలుపెరగని 'కిరణం'



తల్లిదండ్రులతో కిరణ్

హైదరాబాద్: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం తెట్టెకుంట గ్రామానికి చెందిన జంగిలి పాపయ్య, అలివేలమ్మ దంపతుల కుమారుడు జంగిలి కిరణ్ సూర్యాపేట జిల్లా కోదాడలోని ప్రైవేట్ కాలేజీలో బీటెక్ పూర్తి చేశాడు. అతడి తండ్రి పాపయ్య వ్యవసాయం చేస్తుంటారు. తల్లి అలివేలమ్మ వ్యవసాయ పనుల్లో సాయపడుతుంటుంది. కిరణ్ ఎలాగైనా తమకున్న పేదరికాన్ని పోగొట్టాలనుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తేనే అది సాధ్యమవుతుందని నమ్మాడు. అయితే ఎస్సై లాంటి యూనిఫాం ఉన్న ఉద్యోగం అయితే గౌరవం ఉంటుందని ఎంతో కష్టపడ్డాడు. 2016 నోటిఫికేషన్ సమయంలో ఎస్సై ఉద్యోగం వచ్చింది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సమయంలో వచ్చిన ఉద్యోగంలో చేరలేకపోయాడు. ఆ తర్వాతి నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. దీంతో పాటు రైల్వేలో ఉద్యోగం కూడా వచ్చింది. వేటిలోనూ చేరలేదు. ఎస్సై జాబ్ మాత్రమే చేయాలనే ఆకాంక్షతో ఆరేళ్ల పాటు ఎదురు చూశాడు. చివరకు తన కల నెరవేర్చుకుని, తాజా పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొని తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూసి పరవశించిపోయాడు.

బేతవోలు పీఏసీఎస్ సీఈఓ, క్యాషియర్ సస్పెన్షన్

- అత్యవసర సమావేశంలో సంఘం డైరెక్టర్ల తీర్మానం
- ప్రాథమిక విచారణలో అవినీతి జరిగినట్లుగా నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు: మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో క్రాప్ లోన్ల మంజూరులో జరిగిన అవినీతిపై ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'రైతుల పేరిట రూ.20లక్షలు స్వాహా' కథనంపై డీసీసీబీ అధికారులు స్పందించారు. మంగళవారం పీఏసీఎస్‌లో కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. 2021లో రైతులకు మంజూరు చేసిన క్రాప్ లోన్లకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ షరీఫ్ (హుస్సేన్), షేక్ బాషావియా, షేక్ రుక్మోద్దీన్‌తో పాటు పోలేనిగూడెం గ్రామానికి చెందిన తూనం నరేష్ తదితర రైతుల పేరిట ఒక్కొక్కరి పేరు మీద రూ.99వేలు స్వాహా చేసినట్లుగా విచారణలో బయటపడింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాల్సి ఉందని బ్యాంక్ అధికారులు తెలిపారు. బేతవోలు పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్, అధికారులు పీఏసీఎస్ చైర్మన్‌ను ఆదేశించారు.



బేతవోలు పీఏసీఎస్ అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి

సస్పెండ్ చేస్తూ తీర్మానం..

ఈ మేరకు బుధవారం సంఘం సభ్యులు(డైరెక్టర్లు) అత్యవసర సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. సంఘం సీఈఓ పాషా, 2021 మార్చిలో క్యాషియర్‌గా పనిచేసిన వాజీద్ అలీని సస్పెండ్ చేస్తూ తీర్మానం చేశారు. తాత్కాలిక సీఈఓగా సంఘంలో ఎరువుల సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న బత్తిని కన్నయ్యను, క్యాషియర్‌గా నజీర్‌ను నియమించారు. అనంతరం సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘంలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి డబ్బులను రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. తాత్కాలిక సీఈఓగా బాధ్యలు చేపట్టిన బత్తిని కన్నయ్య మాట్లాడుతూ.. సహకార సంఘం నిబంధనల మేరకు పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తాళ్లూరి ప్రసాద్, బజ్జూరి సత్యనారాయణరెడ్డి, మద్ది సుదర్శన్‌రెడ్డి, అనంతు ప్రమీళశ్రీనివాస్, నూనవత్ సోక్లా, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డబ్ల్యూహెచ్‌ఓ బృందం సభ్యులు డాక్టర్ అనూష, డాక్టర్ డేవిడ్

చిట్యాల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) బృందం సభ్యులు డాక్టర్ అనూష, డాక్టర్ డేవిడ్ అన్నారు. బుధవారం వారు చిట్యాల పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రి ఆవరణలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులు, సిబ్బంది వివరాలు, మందుల సరఫరా, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఎస్. పద్మ, ఎస్‌ఓపీ కృష్ణ, వీసీఎం ఉదయ్‌రాజు, వైద్యాధికారి వెంకటేశం, సీహెచ్‌ఓ నర్సింగరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ బృందం సభ్యులు

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

చౌటుప్పల్ రూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జె. సునీత(28) కొన్నేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో ఉంటున్న తన బాబాయ్ వద్దకు వచ్చింది. మూడు సంవత్సరాల క్రితం అదే ఏరియాకు చెందిన రవి అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. పెళ్లైన కొద్దిరోజులకే అతడిని వదిలిపెట్టి వేరుగా ఉంటోంది. ఆరు నెలల క్రితం ఈస్ట్ మారేడుపల్లిలోని తుకారాంగేట్‌కు చెందిన సాయికుమార్‌ను వివాహం చేసుకుంది. సాయికుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరు రెండు నెలల క్రితం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి వచ్చి ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. సాయికుమార్ బుధవారం ఉదయం ట్రాక్టర్ పని కోసం వెళ్లాడు. ఆ సమయంలో తనతో పనికి రమ్మని భర్త చెప్పగా.. ఆమె వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం భర్త సాయికుమార్ ఇంటికి వచ్చేసరికి తలుపులు మూసివేసి ఉన్నాయి. ఎన్నిసార్లు తలుపు తట్టి పిలిచినా సునీత పలకకపోవడంతో అనుమానం వచ్చి గోడ దూకి తలుపు విరగొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. దగ్గరకు వెళ్లిచూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సునీత మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

లారీ నుంచి డీజిల్ చోరీ

బొమ్మలరామారం: పార్కింగ్ చేసిన లారీ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన చీర్ల మల్లేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చీకటిమామిడి గ్రామంలోని బన్ని రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వారం రోజుల క్రితం తన లారీని నిలిపి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం లారీ వద్దకు వచ్చి చూడగా డీజిల్ ట్యాంక్ మూత తెరిచి ఉండడం గమనించాడు. తన లారీ పక్కనే మరో లారీ డీజిల్ ట్యాంక్ మూత సైతం తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు 100 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీవాణి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి పర్నె నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. 2011 ఏప్రిల్‌లో తన నానమ్మ అంత్యక్రియల కోసం స్వగ్రామానికి వచ్చాడు. నరేందర్‌రెడ్డి బంధువులైన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వంగాల దామోదర్‌రెడ్డి, గోగు మధుకర్‌రెడ్డి కూడా అంత్యక్రియలకు వచ్చారు. ఈ క్రమంలో దామోదర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి కలిసి నరేందర్‌రెడ్డితో గొడవ పెట్టుకుని అతడిపై దాడి చేశారు. దీంతో నరేందర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి డీఎస్పీ కేవీ శ్రీనివాస్ నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. క్రిష్టయ్య వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీవాణి నిందితులిద్దరికి రూ.1000 జరిమానా లేదా 3 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని పేరేపల్లి గ్రామంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరేపల్లి గ్రామానికి చెందిన పోలోజు వెంకటాచారి (50) గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ భవనం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గ్రామస్తులు గుర్తించి వెంకటాచారిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటాచారి భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది. అతడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి దుర్మరణం

నాంపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పోలె రామశంకర్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి సాయంత్రం రామశంకర్ ఒక్కడే స్వగ్రామానికి వెళ్తుండగా నేరళ్లపల్లి గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి గుంతలో పడిపోవడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

నకిరేకల్: మండలంలోని తాటికల్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై నకిరేకల్ పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి రూ.52,300 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

ఆర్థిక అసమానతలు తొలగించిన వినోబా భావే

- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: దేశవ్యాప్తంగా 44లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు పంచి ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషిచేసిన గొప్ప వ్యక్తి ఆచార్య వినోబా భావే అని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో భూదానోద్యమ పితామహుడు ఆచార్య వినోబా భావే 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గున్నా రాజేందర్‌రెడ్డి హాజరై వినోబాభావే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో 12 సంవత్సరాల పాటు 84వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి 44లక్షల ఎకరాలు భూమిని వినోబా భావే సేకరించారని కొనియాడారు. అందులో తెలుగు రాష్ట్రాల్లోనే లక్ష ఎకరాల భూమి సేకరించారని అన్నారు. తెలంగాణలో 75వేల ఎకరాల భూదాన్ భూములు ఉండగా వాటిలో సుమారు 50వేల ఎకరాలు 30వేల మంది రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అంతేకాక ఎన్ఎస్‌జీ, నిమ్స్, ఆక్టోపస్, గురుకులాలు, సబ్‌స్టేషన్లు, స్టేడియం, ఆస్పత్రులు తదితర ప్రభుత్వరంగ సంస్థలకు ఉచితంగా భూదాన్ భూములను ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఆచార్య వినోబా భావే 1951, 1956లో రెండుసార్లు పోచంపల్లిని సందర్శించారని, పోచంపల్లిని తన రెండో జన్మస్థానంగా ఆయన పేర్కొన్నారని తెలిపారు. వినోబా భావే అహింసా, ప్రేమ, త్యాగం అనే సర్వోదయ సిద్ధాంతాల వల్ల శాంతిస్థాపన జరుగుతుందని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. వినోబా భావే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వినోబా భావే సేవాసమితి నాయకులు ఏలే భిక్షపతి, కొయ్యడ నర్సింహ, సీత శ్రీరాములు, వేశాల మురళి, కర్నాటి అంజమ్మ, గునిగంటి మల్లేశ్, చేరాల నర్సింహ, భాస్కర్, ఇబ్రహీంపట్నం అంజమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.



వినోబాభావే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు

ఇద్దరు దొంగల అరెస్ట్

మోతె: బైక్‌లు, గొర్రె పొట్టేళ్లు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను మోతె మండలంలో సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిలో సింగరేణిపల్లె టోల్‌గేట్ వద్ద బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంటకు చెందిన ఇండ్ల వీరేష్, స్నేహనగర్‌కు చెందిన భూతం నాగరాజు పల్సర్ బైక్‌పై గొర్రె పొట్టేలును తీసుకుని ఖమ్మం వైపు వెళ్తుండగా.. బుధవారం తెల్లవారుజామున మోతె మండలం సింగరేణిపల్లె టోల్‌గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా.. పెన్‌పహాడ్ గ్రామంలో పల్సర్ బైక్, ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్ప్లెండర్ ప్లస్ బైక్, మోతె మండలం విభళాపురం గ్రామ పరిధిలో గొర్రె పొట్టేలు, సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామ పరిధిలో రెండు గొర్రె పిల్లలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, ఒక గొర్రె పొట్టేలు, రెండు గొర్రె పిల్లలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. వీరు గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి సూర్యాపేట కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కుమారుడిని హత్య చేసిన తండ్రి

- మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తుండడంతో హత్య

ఆత్మకూర్(ఎస్): మద్యానికి బానిసైన కుమారుడు నిత్యం డబ్బుల కోసం వేధిస్తుండడంతో విసుగు చెందిన తండ్రి గొడ్డలితో నరికి హతమార్చాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం కొత్తతండా ఆవాసం బాపూజీతండాలో బుధవారం రాత్రి జరిగింది. బాపూజీతండాకు చెందిన బానోత్ కిరణ్(36) మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలంటూ నిత్యం తల్లిదండ్రులతో పాటు భార్యను వేధిస్తున్నాడు. బుధవారం అతడి భార్య సౌజన్య ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్‌కు వెళ్లగా.. తన భార్యను చూపించడానికి డబ్బులు ఇవ్వాలంటూ తన తండ్రి బానోతు పంతులుతో ఘర్షణకు దిగాడు. దీంతో పంతులు పక్కనే ఉన్న గొడ్డలితో కిరణ్‌పై దాడి చేయగా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు పరిశీలించారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు తెలిపారు. బుధవారం రాత్రి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఖాజా మోయినుద్దీన్ సూచనల మేరకు కొమ్మినేని నరేష్‌కు చెందిన వాహనంలో డ్రైవర్ ఆంగోతు హరి రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకుని కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఆంగోతు రమేష్, బొమ్మిరెడ్డి రమేష్, కొప్పుల అప్పారావును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

లారీ పైనుంచి పడి క్లీనర్ మృతి

హుజూర్‌నగర్: లారీ పైనుంచి జారిపడి క్లీనర్ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం హుజూర్‌నగర్‌లో జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం దుబ్బతండాకు చెందిన జాటోత్ నెహ్రూ (37) తన తమ్ముడు జాటోత్ శరత్‌బాబు లారీపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి సిమెంట్ లోడ్‌తో హైదరాబాద్ నుంచి మేళ్లచెరువుకు బయల్దేరారు. బుధవారం తెల్లవారుజామున హుజూర్‌నగర్ పట్టణ శివారులోకి రాగానే నెహ్రూ తాను కూర్చున్న వైపు లారీ డోర్ వేస్తుండగా జారి కింద పడిపోయాడు. లారీ టైర్లు అతడి తల పైనుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి జాటోత్ హస్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి గొంతు కోసి హత్య

- పాత కక్షలే కారణమంటున్న కుటుంబ సభ్యులు
- నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఘటన



కిరణ్‌కుమార్ (ఫైల్)

నాగారం: గొంతు కోసి యువకుడిని దారుణంగా హత్యచేసిన ఘటన నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన వనగండ్ల కిరణ్‌కుమార్(27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. కిరణ్‌కుమార్‌కు తిరుమలగిరికి చెందిన పత్తేపురం విజయ్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. కిరణ్‌కుమార్ రోజుమాదిరిగానే కారు కిరాయికి వెళ్లి మంగళవారం రాత్రి సుమారు 10గంటల సమయానికి తిరుమలగిరికి చేరుకున్నాడు. అనంతరం తిరుమలహిల్స్‌లోని సాయిబాబా గుడి దగ్గర కారును పార్కింగ్ చేసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. అక్కడే మాటు వేసి ఉన్న పత్తేపురం విజయ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు, అనుచరులు కిరణ్‌కుమార్‌ను అడ్డగించి మరణాయుధాలతో దాడి చేశారు. అనంతరం కిరణ్‌కుమార్‌ను అక్కడి నుంచి కారులో నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామ శివారులో సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్సారెస్పీ కాలువ వద్ద మారణాయుధంతో గొంతు కోసి కాలువ పక్కన పడేసి వెళ్లారు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేట డీఎస్పీ రవి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి హత్య జరిగిన పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు వనగండ్ల సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య తెలిపారు.



మృతదేహం వద్ద డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు